నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- పశ్చిమ నియోజకవర్గంలో 222 పోలింగ్ బూత్‌లు
- సమస్యాత్మక బూత్‌లు 69
- నియోజకవర్గాన్ని 17 సెక్టార్లుగా విభజన
- వయోవృద్ధులు, దివ్యాంగులకు ఓట్ ఫ్రం హోం సాకర్యం
- రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్

సాక్షి ఇంటర్వ్యూ

గోపాలపట్నం: ఎన్నికల్లో పోటీపడే పార్టీ నాయకులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్ స్పష్టం చేశారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. పశ్చిమ నియోజకవర్గంలో 222 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో 2,09,613 మంది ఓటర్లు ఉన్నారని, ఇంకా ఏప్రిల్ 15 వరకు ఎన్‌రోల్ మెంట్ చేసుకునే అవకాశం ఉండడంతో ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలో 222 మంది బూత్ లెవెల్ అధికారులతో ఓటర్ల జాబితాను రూపొందించామన్నారు. దీనికి 22 మంది సూపర్‌వైజర్లు, ఆరుగురు ఏఈఆర్ఓ సహకరించారన్నారు. ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించామని చెప్పారు. నియోజకవర్గాన్ని 17 సెక్టర్లుగా విభజించామన్నారు. ఒక్కో సెక్టర్‌కు ఇద్దరు అధికారులను నియమించామన్నారు. వీరి ద్వారా పోలింగ్ సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.



మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుకు మూడు బృందాలు

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు చేయడానికి మూడు బృందాలను ఏర్పాటు చేశామని రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్ తెలిపారు. ఈ బృందాలతోపాటు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు 3, స్టేటిక్ సర్వైలెన్స్ బృందాలు మూడు, వీడియో సర్వైలెన్స్ బృందాలు 2, వీడియో వ్యూయింగ్ బృందం, ఐటీ టీమ్ బృందం, ఆడిట్ బృందం, ఎలక్ట్రల్ ఎక్స్‌పెండేచర్ అబ్జర్వర్ ఒకర్ని నియమించామన్నారు. నియోజకవర్గంలో పోలింగ్ కంట్రోల్ యూనిట్స్, బ్యాలెట్ యూనిట్స్, వీవీప్యాడ్స్ సిద్ధం చేశామన్నారు.

సమస్యాత్మక బూత్‌లపై నిఘా

నియోజకవర్గంలో 222 పోలింగ్ బూత్‌లున్నాయని, వాటిలో 69 సమస్యాత్మక బూత్‌లుగా గుర్తించామని ఆర్‌ఓ హుస్సేన్ సాహెబ్ చెప్పారు. పోలీసుల సహకారంతో వీటిపై నిరంతర నిఘా పెడుతున్నామన్నారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. గత ఎన్నికల్లో తక్కువ శాతం పోలింగ్ అయిన కేంద్రాలు, సమస్యాత్మక కేంద్రాలను క్రిటికల్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామన్నారు. ఈ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లు, వెబ్ కాస్టింగ్, వీడియో చిత్రీకరణతో పర్యవేక్షిస్తామని చెప్పారు. అంతేకాకుండా అదనపు బలగాలను మోహరించి ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

పక్కాగా కోడ్ అమలు

ఈ నెల 16 నుంచే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి ఆర్‌వో హుస్సేన్ సాహెబ్ పేర్కొన్నారు. కోడ్ వచ్చిన 24 గంటల్లోగా ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రభుత్వ స్థలాల్లో ఉన్న బ్యానర్లను తొలగించామన్నారు. నోడల్ అధికారులుగా జోనల్ కమిషనర్లను కలెక్టర్ నియమించారన్నారు. నియోజకవర్గంలో విగ్రహాలన్నిటికి మాస్కులు వేశామన్నారు.

పార్టీలన్ని ఎన్నికల కోడ్ తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్థలాల్లో, ప్రభుత్వ భవనాలపై పార్టీ జెండాలు, పార్టీ బ్యానర్లు, పోస్టర్లు ఉండరాదన్నారు. ప్రయివేటు భవనాలపై జెండాలు, బ్యానర్లు కట్టినట్టయితే తప్పని సరిగా భవన యజమాని లిఖిత పూర్వక అంగీకార పత్రం తీసుకోవాలన్నారు.

సువిధ యాప్ ద్వారా అనుమతులు

ఎన్నికలకు సంబంధించిన అన్ని అనుమతులు సువిధ యాప్‌లో లభిస్తాయి. వాహనాలకు సంబంధించిన అనుమతులు, పార్టీ కార్యాలయాలు, లౌడ్ స్పీకర్లు, సభలు, సమావేశాలు తదితర అన్ని అనుమతులు ఈ యాప్‌లో లభిస్తాయని ఆర్‌వో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. పార్టీలకు సంబంధించిన స్టిక్కర్లు మో టారు వాహనాలకు అతికించుకోవాలన్నా అనుమతి కావాల్సిందే. కార్లతోపాటు బైక్‌లకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయి. అవి కూడా 48 గంటల ముందుగానే యాప్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అప్పటికప్పుడు అనుమతులు ఇవ్వడం సాధ్యం కాదు. యాప్‌లో అనుమతులన్నీ ఉచితంగానే లభిస్తాయి. ఎలాంటి రుసుం ఉండదు. ఎన్ని వాహనాలకైనా అనుమతులను ఆన్‌లైన్‌లో ఉచితంగా ఇస్తాం. అయితే వాటికి సంబంధించిన ఖర్చును పార్టీల ఖాతాలో జమ చేస్తాం. నాయకులకు తెలియకుండానే నిరంతరం మా నిఘా ఉంటుంది. ప్రతి కదలికను వీడియో తీస్తాం. దాని ఆధారంగా ఖర్చులను పార్టీల ఖాతాకు వేస్తాం. కార్యకర్తలు నిర్వహించే కార్యకలాపాల్లో టిఫిన్‌లు, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం, చివరకు టీలకు సంబంధించిన ఖర్చు కూడా పార్టీకి జమ అవుతుంది. ప్రస్తుతం అభ్యర్థులు లేరు కనుక ఆ ఖర్చు పార్టీలకు వేస్తాం. అభ్యర్థులు వచ్చాక వారి ఖాతాకు జమ అవుతుంది. వారి తరుపున ఎవరైనా కార్యకలాపాలు నిర్వహించిన ఖర్చ మాత్రం అభ్యర్థులకు జమ అవుతుంది.

ఫిర్యాదులపై 40 నిమిషాల్లో చర్యలు

ఎన్నికల ఫిర్యాదులపై కేవలం 40 నిమిషాల్లో చర్యలు తీసుకుంటామని ఆర్‌వో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. సీ విజిల్ యాప్‌ద్వారా ఎవరైనా ఫిర్యాదు చేస్తే అది ముందుగా జిల్లా కంట్రోల్ రూమ్‌కు వెళ్తుంది. అక్కడ్నుంచి మాకు చేరుతుంది. వెంటనే సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేసి ఫిర్యాదుపై చర్య తీసుకుంటాం. దీనికి సంబంధించి ప్రత్యేక టీమ్‌లు పని చేస్తాయి. ఆ టీమ్‌లు ఉపయోగించే వాహనాలకు జీపీఎస్‌ను యాక్టివేట్ చేశాం. యాప్‌లో ఫిర్యాదు చేసేవారి ఫోన్ కూడా ఆటోమేటిక్‌గా జీపీఎస్‌కు కనెక్ట్ అవుతుంది. దాని ఆధారంగా మా టీమ్‌లు ఫిర్యాదు అందిన స్థలానికి సునాయాశగా చేరుకొంటారని ఆయన వివరించారు.

ఓట్ ఫ్రమ్ హోం

85 ఏళ్లు పైబడిన వారు, దివ్యాంగులు ఇంటి నుంచి ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆర్‌వో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. 85 ఏళ్లు దాటిన వారికి, దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు వేసే సాకర్యం ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. దివ్యాంగులు అందరికీ కాకుండా 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం కలిగి ఉన్న వారికి మాత్రమే ఈ ఓట్ ఫ్రమ్ హోం వేయచ్చని వివరించారు. వీరు ఫారమ్ 12డి దరఖాస్తును నింపి రిటర్నింగ్ అధికారికి సమర్పిస్తే ముందుగానే పోలింగ్ అధికారుల బృందం ద్వారా ఇంటి వద్దే బ్యాలెట్ పేపర్‌ను పంపి ఓటు వేసే అవకాశం కల్పించే ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకునేందుకు విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఆర్‌వో హుస్సేన్ సాహెబ్ తెలిపారు.

క్లుప్తంగా

వీరమ్ బ్లాక్ ప్రారంభం



వీరమ్ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న నేవల్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అడ్మిరల్ హరికుమార్

సింధియా: విశాఖపట్నంలోని నౌశక్తినగర్‌లో డీఎస్సీ సిబ్బంది (492 మంది పురుషులు) కోసం వసతి భవనం వీరమ్ బ్లాక్‌ను గురువారం నేవల్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అడ్మిరల్ ఆర్ హరికుమార్, పీవీఎస్ఎమ్, ఏవీఎస్ఎమ్, వీఎస్ఎమ్ ప్రారంభించారు. వీరమ్ బ్లాక్‌లో బయోగ్యాస్ ప్లాంట్‌తో కూడిన కుక్ హౌస్, వ్యాయామశాల, వినోద పరికరాలు, గ్రంథాలయ సౌకర్యాలతో కూడిన అత్యాధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు నేవీ వర్గాలు తెలిపాయి.

ఆరోగ్య సురక్ష శిబిరానికి స్పందన

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు రామ్మూర్తిపంతులుపేట పరిధి కంచరపాలెం వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో గురువారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని యూపీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారిని మట్టా శశి ప్రియాంక తెలిపారు. ప్రత్యేక వైద్యాధికారుల పర్యవేక్షణలో పలు ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 289 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. జోన్-5 పబ్లిక్ హెల్త్ ఎంఎంహెచ్‌వో డాక్టర్ సునీల్ వైద్యశిబిరాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్‌కు ఆనంద్ పరామర్శ



వలంటీర్‌ను పరామర్శిస్తున్న ఆనంద్ కుమార్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు కరాస వలంటీర్ హిమబిందును గురువారం పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ పరామర్శించారు. ద్విచక్ర వాహన ప్రమాదంలో హిమబిందు గాయపడిన విషయాన్ని తెలుసుకున్న ఆనంద్ కుమార్ ఆమె ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. హిమబిందుకు స్థానిక సంజీవిని ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించేలా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా హిమబిందు ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని ఆడారి ఆనంద్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం బాబావారికి పంచామృతాలతో అర్చకులు అభిషేకం నిర్వహించారు. సాయంత్రం బాబాకు పంచహారతులు ఇచ్చారు. భక్తులంతా సమాహికంగా సాయి సంకీర్తన ఆలపించారు. మంత్రపుష్పం జపించారు. సాయి సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్లా సత్యనారాయణ రావు, కోశాధికారి సుబ్బారావు, కమిటీ సభ్యులు రాజు, వెంకటేశ్వరరావు, భూలోక్, కిశోర్ పాల్గొన్నారు.

ఉమారాణి, రమణికుమారిలకు ఆత్మీయ సత్కారం



ఉమారాణి, రమణికుమారిలను సత్కరిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్. చిత్రంలో ఎస్‌ఏ రహమాన్

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన పీలా ఉమారాణి, పేడాడ రమణి కుమారిలను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలో ఎన్నికల పరిశీలకుడిగా ఉన్న ఎస్ఏ రహమాన్‌తో పాటు అదనంగా వీరిని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియమించారు. ఈ మేరకు ఎస్ఏ రహమాన్ ఆధ్వర్యంలో గురువారం పార్టీ కార్యాలయంలో ఆనంద్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఏ రహమాన్ మాట్లాడుతూ గోపాలపట్నం ప్రాంతంలో 7 వార్డులు పేడాడ రమణి కుమారి, పారిశ్రామిక ప్రాంతంలో 7 వార్డులు పీలా ఉమారాణి పరిశీలకులుగా వ్యవహరిస్తారన్నారు. స్థానికంగా నాయకులను సమన్వయ పరుస్తూ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తారన్నారు. ఈ సందర్భంగా ఆడారి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ తన గెలుపు కోసం పరిశీలకులు సూచించిన సలహాలను తూచా తప్పకుండా పాటిస్తానని తెలిపారు. ఉమారాణి, రమణి కుమారి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులను సమన్వయ పరుస్తూ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యలమంచిలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పీలా రమాకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై మహిళలు దృష్టి పెట్టాలి



వ్యర్థాలతో పువ్వులు తయారు చేసిన విద్యార్థులు

మల్కాపురం: మహిళలు చేతివృత్తులకు ప్రాధాన్యత నిస్తూ స్వయం ఉపాధిని సాధించాలని, హస్తకళలను బతికించాలని జాతీయ సేవా పథకం ప్రొగ్రాం అధికారి ఎ.సంధ్యారాణి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1,2 ఆధ్వర్యంలో 60వ వార్డు ఇందిరాకాలనీ, బర్మాకాలనీ ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలను గురువారం నిర్వహించారు. కార్యక్రమాలలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ ఎదో ఒక వృత్తి నైపుణ్యాన్ని అలమర్చుకోవాలని అన్నారు. స్వయం ఉపాధి ద్వారా పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి మహిళలు ఎదగాలన్నారు. పనికి రాని కాగితాలతో రంగు రంగు పువ్వులు, ఫ్లవర్‌బొకేల తయారీలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రహదారుల కళకళ

- హిమచల్‌నగర్, ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ ప్రాంతాల్లో మెరుస్తున్న బీటీ రోడ్లు
- రూ.40 లక్షలతో నిర్మాణం



19 లక్షలతో వేసిన బీటీ రోడ్డు

మల్కాపురం: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక ప్రాంతంలో రహదారులు అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రహదారులు మెరుగుపడ్డాయి. జీవీఎంసీ 59వ వార్డు పరిధి ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ, హిమచల్‌నగర్ ప్రాంతాల్లోని బీటీ రోడ్లు కళకళలాడుతున్నాయి. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆయా ప్రాంతాల్లో పర్యటించిన నేపథ్యంలో అధ్వానంగా ఉన్న రహదారుల సమస్యను ఆయన దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి ఆ రెండు ప్రాంతాల్లో సుమారు రూ.40 లక్షలతో బీటీ రోడ్లను నిర్మించారు. దీంతో ఆయా ప్రాంతవాసులు ఆడారి ఆనంద్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

గతంలో చాలా అధ్వానం



హిమచల్‌నగర్ ప్రాంతంలోని బీటీ రోడ్డు చాలా అధ్వనంగా ఉండేది. ఈ ప్రాంతానికి వచ్చిన ఆడారి ఆనంద్ కుమార్‌కు రోడ్డు సమస్య చెప్పడంతో ఆయన స్పందించి అద్దాల మాదిరిగా రహదారులు వేయించారు. ఇప్పుడు మా రహదారులు చాలా బాగున్నాయి.

–అప్పారావు, హిమచల్‌నగర్

ఆనంద్‌కుమార్‌కు కృతజ్ఞతలు



ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ, వేంకటేశ్వస్వామి ఆలయ డౌన్ ప్రాంతంలోని బీటీ రోడ్డు పిక్క తేలి, గుంతలు ఏర్పడి చాలా అధ్వానంగా ఉండేది. తమ ప్రాంతానికి వచ్చిన ఆడారి ఆనంద్‌కుమార్‌కు సమస్య చెప్పకోవటంతో ఆయన మూడు నెలల్లో సమస్యను పరిష్కరించారు. బీటీ రోడ్డును వేసేలా అధికారులతో మాట్లాడారు.

–చైతన్యకుమార్, ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ



21 లక్షలతో హిమచల్‌నగర్ వద్ద వేసిన బీటీ రోడ్డు

అందుబాటులో ఉంటా...ఆదరించండి

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్ కుమార్ విస్తృత ప్రచారం
- కాలనీల్లో బ్రహ్మరథం పట్టిన ప్రజానీకం



ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు



చిన్నారిని ఎత్తుకున్న ఆనంద్ కుమార్



ఆనంద్‌కు హారతులు ఇస్తున్న మహిళలు

విశాఖ విద్య: విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ గురువారం 90వ వార్డులోని పలు కాలనీల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వార్డు పరిధిలోని గాంధీనగర్, రెడ్డివీధి, గవరవీధి, గొల్ల వీధి, రెడ్డివీధిరామాలయం తదితర కాలనీల్లో నిర్వహించిన ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు ఓటు వేసి గెలిపిస్తే, అందుబాటులో ఉండి, అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పీలా రమాకుమారి, వార్డు నాయకులు సమ్మి శ్రీను, చుక్కా ప్రసాద్ రెడ్డి, యల్లపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో నేటి నుంచి ఆడారి ప్రచారం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ శుక్రవారం నుంచి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. శుక్రవారం 63వ వార్డులో సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7:30 వరకు కాకరలోవ ప్రాంతంలో ని కాకరలోవ, భగత్‌సింగ్ ఏరియా, కాకరలోవ రామాలయం ఏరియా చింతలలోవ ఏరియాలలో ప్రచారం నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7.30 వరకు గుడివాడ అప్పన్నకాలనీ ఏరియా పరిధిలోని గల అల్లూరి సీతరామరాజుకాలనీ, సాయిబాబా ఆలయం, దుర్గానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయం ఏరియా, ఎన్‌టీఆర్ కాలనీ ఏరియా ప్రాంతాల్లో పర్యటిస్తారు.

నేడు హెచ్‌పీసీఎల్ సొసైటీ సభ్యుల సమావేశం

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ సొసైటీ సభ్యుల సర్వసభ్య సమావేశం 58వ వార్డు పరిధి పలకవానిపాలెం రోడ్డు వద్ద గల వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు జరగనుంది. సొసైటీ అధ్యక్షుడు ఎన్.వి.రమణ ఆధ్వర్యంలో జరగనున్న ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణలు పాల్గొని సొసైటీ కార్మికుల సమస్యలు తెలుసుకుంటారు.

క్షయపై అవగాహన ర్యాలీ



కంచరపాలెం యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ ప్రారంభించిన డాక్టర్ శశి ప్రియాంక

కంచరపాలెం: ఈ నెల 24 ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం 'క్షయ వ్యాధిని మనం అంతమొందించగలం' అనే నినాదంతో జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం కూడలిలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మట్టా శశి ప్రియాంక ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ వ్యాధిపై ప్రజలు నిర్లక్ష్యం చేయరాదన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, ఎస్‌టీఎల్ఎస్ శరత్, ఎల్‌టీ పూర్ణిమ, టీబీహెచ్‌వీఎస్ పైడిరాజు, హెచ్‌వీ భారతీ, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కార్మిక పరిరక్షణకు పోరాడతాం



మాట్లాడుతున్న ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ శ్రీనివాసరావు

కంచరపాలెం: కార్మికుల పక్షపాతిగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ వారి పరిక్షణకు పోరాడతామని ఐఎన్‌డీడబ్ల్యూఎఫ్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ ఆర్ శ్రీనివాసరావు అన్నారు. కంచరపాలెం పరిధి మేఘాద్రిపేటలోని కళా మేఘా ఓపెన్ ఆడిటోరియంలో గురువారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓపీఎస్ సాధన, 8వ పే కమిషన్ ఏర్పాటు, పూర్వ నేవెల్ డాక్ యార్డ్ అప్రెంటిస్ ఇంక్రిమెంట్లు, ఓటీ, హెచ్ఆర్ఏ, పలు సమస్యలపై ఆయన మాట్లాడారు. ఓపీఎస్ సాధన కోసం ఆలిండియా కార్మిక సంఘాలన్నీ ఏకతాటిపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు బి.భోగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి.చిన్నారావు, ఎన్ఏడీ జీఎస్ ఎస్ మారయ్య, డీజీఎన్‌పీ అధ్యక్షుడు మేరపురెడ్డి కొండబాబు, ఎస్సీ,ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్, అప్పలరాజు, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు సర్వసిద్ధి వెంకటరమణ, గుమ్మిడి ఆదినారాయణమూర్తి పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు



స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేస్తున్న అధికారులు, అర్చకుడు, భక్తులు



నిత్య కల్యాణంలో యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చన వైభవంగా జరిపారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను బేడా మండపంలో వేదికపై వేంజేపచేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు.

అంధురాలి కుటుంబానికి భరోసా



వృద్ధురాలిని పరామర్శిస్తున్న ఆనంద్ కుమార్, డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు అంబేడ్కర్ నగర్‌లో నిరాశ్రయులైన అంధురాలి కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. అంధులైన తల్లీబిడ్డలు అంబేడ్కర్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. వారికి ఎవ్వరూ లేకపోవడంతో ఈ విషయాన్ని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ద్వారా వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ తెలుసుకొని గురువారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.